

షష్ఠి ఉత్సవాలు ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో శ్రీ వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక సుబ్బారాయుడు గుడి సెంటర్‌లోని ఆలయంలో షష్ఠి ఉత్సవాల్లో భాగంగా శనివారం గణపతిపూజతో ఉత్సవాలను ప్రారంభించినట్లు ఆలయ అధ్యక్షుడు గుణ్ణం విశ్వేశ్వరరావు తెలిపారు.

వైఎస్సార్ సీపీ మండల గౌరవాధ్యక్షుడిగా మైఖేల్ రాజు


ఎం మైఖేల్‌రాజు

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, పార్టీ మండల మాజీ కన్వీనర్ మైలాబత్తుల మైఖేల్‌రాజును వైఎస్సార్ సీపీ మండల గౌరవాధ్యక్షుడుగా నియమించారు. వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల ఇన్‌చార్జ్, రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సూచనల మేరకు మైఖేల్‌రాజును మండల కమిటీ గౌరవాధ్యక్షుడిగా నియమించినట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) శనివారం తెలిపారు. మైఖేల్‌రాజు ఆగర్తిపాలెం గ్రామ సర్పంచ్‌గా, ఎంపీటీసీగా పనిచేశారు. 2014 నుంచి 2023 వరకు పార్టీ మండల కన్వీనర్‌గా పనిచేశారు. టీటీడీ పాలకమండలి సభ్యులు మేకా శేషుబాబు, చింతలపూడి, దెందులూరు పార్టీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, చిట్టూరి ఏడుకొండలు తదితరులు మైఖేల్‌రాజును అభినందించారు.

గ్రామాల్లో రహదారులన్నీ అభివృద్ధి చేస్తాం


పోడూరులో రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు

పోడూరు: గ్రామాల్లో రహదారులన్నీ త్వరితగతిన అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పోడూరులో శనివారం ఆయన కవిటం–పైడావ ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు 7 కిలోమీటర్ల మేర ఉన్న కవిటం–పైడావ రహదారిని అభివృద్ధి చేయాలని స్థానిక నాయకుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం నుంచి సుమారు రూ.3 కోట్ల నిధులు తీసుకొచ్చినట్లు చెప్పారు. రహదారిని నాణ్యతా ప్రమాణాలను పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, సర్పంచ్ శెట్టి బత్తుల సువర్ణరాజు, ఏఎంసీ మాజీ వైస్‌ఛైర్మన్ చేకూరి సూరిబాబు, ఏఎంసీ వైస్‌ఛైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, వైస్‌ఎంపీపీ ఇందుకూరి చినబాబు, ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు, పోడూరి సత్యసాయిబాబా పాల్గొన్నారు.

చిట్టిమోషే మృతి

పెనుగొండ: మాల మహానాడు మండల మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చిట్టి మోషే (65) మృతి చెందారు. శుక్రవారం రాత్రి గుండె పోటు రావడంతో ఆసుపత్రికి వెళ్లకుండానే ప్రాణాలు విడిచారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు శనివారం చిట్టి మోషే మృత దేహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ మట్టా ఆనంద్‌కుమార్, సర్పంచ్ కోట సరోజనీ వెంకటేశ్వరరావు, వేదాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డీఈవో ఆకస్మిక తనిఖీ

పెనుగొండ: జిల్లా విద్యాశాఖాధికారి వెంకటరమణ పెనుగొండలోని ప్రైవేటు స్కూల్లో శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ కొమ్ముల రామకృష్ణ, ఛైర్మన్ కొల్లాటి పెద్దిరాజు, ప్రిన్సిపాల్ జెమిమా పాల్గొన్నారు.

కనులారా ద్వారకాతిరుమలేశుని దర్శనం

పెనుమంట్ర: పెనుమంట్ర వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తేతలి సుధీర్‌రెడ్డి చేపట్టిన నవ దేవాలయాల సందర్శన 5వ పాదయాత్ర శనివారం ఉదయం ద్వారకాతిరుమలలో వేంకటేశ్వరుని దర్శనంతో పూర్తయింది. ఇంకా ఆయన జిల్లాలో నాలుగు ప్రముఖ ఆయాలను సందర్శించాల్సి ఉంది. గురువారం ద్వారకా తిరుమల యాత్రకు బయలుదేరిన ఆయన వెంట పెనుమంట్ర మండలానికి చెందిన సుమారు 200 మందికి హిందూ భక్తులు ఆయన వెంట బయలుదేరి వెళ్లారు. భక్తులందరికీ ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అల్పాహారంతో పాటు భోజన వసతిని ఏర్పాటు చేశారు. ద్వారకాతిరుమల దేవస్థాన అధికారులతో మాట్లాడి భక్తులందరికీ ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేయించారు. వేంకటేశ్వరుని కనులారాచూసే అవకాశాన్ని కల్పించారని భక్తులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. శనివారం సుధీర్‌రెడ్డి తన మిత్ర బృందంతో ఆచంటలోని ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి ఆయనను దుశ్శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తాం

నరసాపురం: అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరిస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పలు డిమాండ్ల సాధనకై అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో రిలే దీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. శనివారం శిబిరాన్ని ప్రభుత్వ చీఫ్‌విప్ సందర్శించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీఐటీయూ నాయకుడు తెలగంశెట్టి సత్యనారాయణ అంగన్‌వాడీల డిమాండ్లను వివరించారు.

ఎమ్మెల్యే నిమ్మల ఆరోపణలు అవాస్తవం

పాలకొల్లు అర్బన్: యలమంచిలి మండలం బాడవలో వృద్ధుడు రాయి వెంకట సత్యనారాయణ తన పింఛను తీసుకోవడానికి కలగంపూడి వెళ్లాల్సి వస్తోందని దీనికి స్థానిక వైఎస్సార్ సీపీ నేతలే కారణమని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఆరోపించడంలో వాస్తవం లేదని వైఎస్సార్ సీపీ నేతలు శనివారం అన్నారు. అధికారులు, గ్రామ వలంటీర్లు పథకాలను వివరించేందుకు రాయి వెంకట సత్యనారాయణ ఇంటికి వెళ్లిన సమయంలో ప్రభుత్వ పథకాలు అవసరం లేదంటూ ఆయన తిరస్కరించారని వివరించారు. వలంటీరు పింఛన్ ఇవ్వడానికి సత్యనారాయణ ఇంటికి వెళ్లగా ఆ వ్యక్తి తిరస్కరించి వేలిముద్ర వేయలేదన్నారు. దీంతో వలంటీర్ లాగిన్ నుంచి అతని పేరు తొలగిపోయిందన్నారు. బాడవ గ్రామానికి వెల్ఫేర్ అసిస్టెంట్ లేకపోవడంతో కలగంపూడి వెల్ఫేర్ అసిస్టెంట్ లాగిన్‌లోకి వెంకట సత్యనారాయణ పేరు వెళ్లిందన్నారు. దీంతో అతను కలగంపూడి వెళ్లి పింఛన్ తీసుకుంటున్నారని తెలిపారు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులకు దీంతో ఏ విధమైన సంబంధం లేదన్నారు. ఎమ్మెల్యే నిమ్మల వాస్తవాలు తెలుసుకోకుండా బురదజల్లడం మానుకోవాలని హితవు చెప్పారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఇనుకొండ చిన్న, ఏనుగువానిలంక సొసైటీ త్రిసభ్య కమిటీ అధ్యక్షుడు రావూరి రామకృష్ణ, సచివాలయ కన్వీనర్ ఇలపకుర్తి నరసింహరావు, గ్రామ నాయకులు గవర చంద్రరావు, ఇంటి గంగాధర్, గెల్లి గణపతి ఉన్నారు.



ప్రకటన

పశ్చిమగోదావరి జిల్లా, పెనుమంట్ర మండలం, సత్తారామేశ్వరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ రామేశ్వర స్వామి వారి దేవస్థానమునకు నూతన ధర్మకర్తల మండలి నియామకమునకు శ్రీయుత ఉప కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, కాకినాడ వారి నోటీస్ నెంబర్ బి1/478223/2023 తేది: 14.12.2023 ఉత్తర్వులలో నోటిఫికేషన్ జారీ చేసియున్నారు. సదరు ఉత్తర్వులు ప్రకారం ధర్మకర్తలుగా ఆసక్తిగల సభ్యులు 20 రోజులలో అనగా ది.04.01.2024లోగా ధరఖాస్తులు సమర్పించవలసినదిగా కోరడమైనది. స్వామి వారి సేవలో

ఆర్.గంగా శ్రీదేవి కార్యనిర్వహణాధికారి

లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ

పెనుగొండ: లబ్ధిదారులకు అందించే ఓటీఎస్ పట్టాలను తప్పుదారి పట్టించడానికి టీడీపీ నాయకులు కుటిల యత్నాలు చేయడంతో హైడ్రామా నెలకొంది. శనివారం కరుగోరుమిల్లిలో 133 మంది లబ్ధిదారులకు ఓటీఎస్ పట్టాలు పంపిణీ చేయడానికి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు నిర్ణయించారు. మధ్యాహ్నం 3 గంటలకు పంపిణీ చేస్తామని ప్రకటించారు. పట్టాల పంపిణీని అడ్డుకునేందుకు కుయుక్తులు పన్ని పట్టాలు ఈ కార్యక్రమం వాయిదా పడిందంటూ సెల్ ఫోన్లలో వలంటీర్లకు తప్పుడు సమాచారం పంపించడంతో సందిగ్ధత నెలకొంది. పేదలకు పట్టాలు అందించకుండా పన్నాగంలో భాగంగానే దుష్ప్రచారం చేసారంటూ లబ్ధిదారులు విమర్శించారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీరంగనాథరాజు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పట్టాలు పంపిణీ చేయడంతో కుట్రలు భగ్నం అయ్యాయి.



వైభవంగా వేంకటేశ్వరస్వామి కళ్యాణం


కల్యాణం తంతు నిర్వహిస్తున్న అర్చక స్వాములు, చిత్రంలో టీటీడీ బోర్డు సభ్యుడు మేకా శేషుబాబు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివార్ల దివ్య కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం స్థానిక ఆర్‌ఆర్ రైస్‌మిల్లు ప్రాంగణంలో తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మహోత్సవ విగ్రహాలతో టీటీడీ వేద పండితులతో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కళ్యాణాన్ని తిలకించారు. ఆదివారం అన్నవరం నుండి సత్యదేవుని వ్రత రథం, అన్నవరం దేవస్థానం పురోహితుల ఆధ్వర్యంలో సామూహిక ఉచిత సత్యదేవుని హోమం, వ్రతం నిర్వహించనున్నారు. టీటీడీ బోర్డు సభ్యులు మేకా శేషుబాబుకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా శేషుబాబు మాట్లాడుతూ పట్టణంలో శ్రీనివాస కళ్యాణం నిర్వహించడం క్షీరపురి ప్రజలు చేసుకున్న పూర్వజన్మసుకృతమని అన్నారు. ఈ కార్యక్రమంలో అతిథులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.